క్లుప్తంగా

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి ధామంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు పెద్ద సంఖ్యలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ముందుగా సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి అనంతరం ఆలయంలో మహాలక్ష్మీ అమ్మవారి కలశ స్థాపన నిర్వహించారు. మహాలక్ష్మీ అమ్మవారికి కుంకుమతో అర్చనలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో సాయి సేవకులు పాల్గొన్నారు.

తులసీదళ తిరుమలేశుడు



తులసీదళాలతో తిరుమలేశుడు

అక్కిరెడ్డిపాలెం: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశుడికి విశేష పూజలు నిర్వహించారు. గురువారం తిరుమలేశునికి తులసీదళాలతో విశేష అలంకరణ చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశుడిని భక్తులు దర్శించుకున్నారు.

అయ్యప్పకు ఉత్తరా నక్షత్ర పూజలు



విశేషఅలంకరణలో అయ్యప్పస్వామి

ఉక్కునగరం: అయ్యప్ప జన్మ నక్షత్రం ఉత్తర నక్షత్రం సందర్భంగా రుత్వికుల ఆధ్వర్యంలో గణపతి హోమం చేశారు. అనంతరం ప్రధానార్చకులు నాగేశ్వరస్వామి అయ్యప్పస్వామికి అష్టాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు వేకువజామున ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామి విశేషఅలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల పూజలు



గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న గ్రామ ప్రజలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు హరిజనజగ్గయ్యపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ ప్రజలు నందీశ్వరుడిని, గౌరమ్మను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గ్రామంలో వేదిక వద్ద శ్రీ గౌరీ పరమేశ్వరులను వద్ద ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం ఎంపీపీ పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో నాడు – నేడు కింద తరగతి గదులను అందంగా తీర్చిదిద్దారు. ప్రాంగణంలో సిమెంట్ బ్రిక్‌లతో నిర్మాణాలు చేపట్టారు. దీంతో విద్యార్థులకు కొన్ని ఇబ్బందులు తప్పాయి. అయితే ఎన్నికలు రావడంతో పలు పనులు నిలిచిపోయాయి. ఎన్నికలు జరిగిన కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా పెండింగ్ పనులపై దృష్టి సారించలేదు. దీంతో అదనపు తరగతి గదులు, టాయిలెట్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయి.



ప్రత్యేక అలంకరణలో పాతగాజువాక శివాలయం



వినాయకనగర్‌లోని పంచాయతన ఆలయం



కార్తీక పూజలకు సిద్ధమైన టౌన్‌షిప్ శివాలయం

కార్తీక పూజలకు వేళాయె

పవిత్ర కార్తీక మాసం ఆరంభం కానుండడంతో విశేష పూజలు అందుకోవడానికి శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు ఆలయాల ప్రాంగణాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీకమాసంలో భక్తులు శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయాలన్నీ హర స్మరణతో మార్మోగుతాయి. ఈ మాసంలో శివాలయంలో దీపం వెలిగిస్తే జన్మజన్మల పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.



ఉక్కు బీసీ గేటు శివాలయంలో శివపార్వతుల విగ్రహాలు

ముస్తాబైన శివాలయాలు



అప్పికొండ సోమేశ్వరాలయంలో మహా శివలింగం

గాజువాక: పవిత్ర కార్తీక మాసం పూజలకు గాజువాక ప్రాంతంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయ కమిటీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కావడంతో తొలి సోమవారం పూజల కోసం పచ్చని పందిళ్లు, తోరణాలతో ఆలయాలను అలంకరిస్తున్నారు.

- వినాయకనగర్ వుడాకాలనీలోని కాశీ విశాలాక్షి విశ్వేశ్వర సహిత పంచాయతన ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీ వసతులు కల్పిస్తోంది.
- చట్టివానిపాలెం, చిట్టినాయుడుకాలనీ ఈశ్వరాలయం, అయ్యప్పస్వామి ఆలయాలను పూజల కోసం ముస్తాబు చేస్తున్నారు.
- దుర్గవానిపాలెం, గాజువాక గౌరీపరమేశ్వరుల ఆలయాల్లో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.
- బీసీరోడ్డు సంజీవకాలనీలో శ్రీభద్రావతి భావనా రుషీశ్వరుల సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు సర్వం సిద్ధం చేశారు.
- శ్రీనగర్ ప్రాంతంలోని దుర్గానగర్‌లో శ్రీదుర్గా గణపతి సమేత మహాజ్ఞాన సరస్వతీ దేవాలయంలో ప్రత్యేక పూజలల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.
- అప్పికొండ సోమేశ్వరాలయంలో కూడా కార్తీక పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దేశంలోని పూరాతన ఆలయాల్లో ఇది 3వ ఆలయంగా గుర్తింపు పొందడంతో ఇక్కడకి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ప్రముఖులు సైతం కార్తీక మాసంలో ఈ ఆలయంలోని సోమేశ్వరస్వామిని దర్శించుకుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని దేవదాయ శాఖాధికారులు ఏర్పాట్లు సాగిస్తున్నారు.



వంటిల్లు జంక్షన్‌లోని ఉమారామలింగేశ్వర ఆలయంలో శివలింగానికి అభిషేకం

ఉక్కు శివాలయాలు ముస్తాబు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ శివాలయం, బీసీ గేటు సమీపంలోని పురాతన శివాలయాలు కార్తీక పూజలకు సిద్ధమయ్యాయి. శనివారం నుంచి కార్తీక ప్రారంభం కావడంతో భక్తులు వేకువజామున శివాలయాలకు వెళ్లి పూజలు చేస్తారు. ముఖ్యంగా ఈనెల 04, నవంబర్ 11, 18, 25 తేదీల్లో వచ్చిన కార్తీక సోమవారాల్లో ఆలయాలకు భక్తులు పోటెత్తుతారు. ఇందుకు సంబంధించి ఆయా ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. టౌన్‌షిప్ శివాలయంలో కార్తీకమాసం సందర్భంగా ప్రతీ రోజు సాయంత్రం 7 గంటలకు గోత్ర నామాలతో ఉమామహేశ్వరునికి బిల్వార్చన నిర్వహించనున్నారు. నాలుగు కార్తీక సోమవారాలు, కార్తీక పౌర్ణమి రోజుల్లో ఉదయం 4 గంటలకు స్వామికి గోత్ర నామాలతో పంచామతాభిషేకాలు చేస్తారు. కార్తీక ఏకాదశుల్లో సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు చేయనున్నారు. కార్తీక పౌర్ణమి నాడు ఉదయం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, సామూహిక కుంకుమార్చన, సాయంత్రం జ్వాలాతోరణం, తులసి పూజలు నిర్వహిస్తారు. నాలుగు సోమవారాలు సాయంత్రం 6.30 గంటలకు జ్యోతిర్లింగార్చన చేస్తారు. మాసశివరాత్రి సందర్భంగా లక్షపత్రి పూజ, మహారుద్రాభిషేకం, నవగ్రహ హోమాలు, పూర్ణాహుతి నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

- బీసీ గేటు శివాలయంలో ప్రతీ రోజూ గోత్ర నామాలతో అర్చనలు చేయనున్నారు. కార్తీక ఏకాదశుల్లో సామూహిక వ్రతాలు, కుంకుమార్చనలు చేస్తారు. నాలుగో సోమవారం పెద్ద ఎత్తున భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించనున్నారు.

భక్తిశ్రద్ధలతో భైరవుడి విగ్రహ ప్రతిష్ట



కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని వైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం కాల భైరవ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు, మహిళలు అంతా పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ప్రతి ఆదివారంతో పాటుగా నెలలో వచ్చే అమావాస్య రోజు స్వామి వారికి విశిష్ట పూజలు నిర్వహిస్తామని భక్తులందరూ పాల్గొనాలని కోరారు. ఆలయ చైర్మన్ దొడ్డి రమణ, సత్యనారాయణ, సత్యారావు, జానకి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా దీపావళి



కాకరపువ్వొత్తులు వెలిగిస్తున్న బాలిక

అగనంపూడి: దీపావళి సంబరాలు ఆనందడోలికల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అగనంపూడి, వడ్లపూడి, దువ్వాడ నిర్వాసితకాలనీలతో పాటు కూర్మన్నపాలెం, లంకెలపాలెంలో దీపావళి ప్రశాంతంగా ముగిసింది.

అక్రమ లేఆఫ్ ఎత్తివేయాలని ఆందోళన

అగనంపూడి: అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ విధించిన అక్రమ లే ఆఫ్‌ను ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ దువ్వాడ వీఎస్ఈజెడ్ గేటు వద్ద ఆ కంపెనీ కార్మికులు ధర్నా చేశారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఫెర్రో టెక్ కంపెనీ లే ఆఫ్ ప్రకటించడాన్ని నిరసిస్తూ వీరంతా ఆందోళన చేపట్టారు. సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో అభిజిత్ కంపెనీ కార్మికులు అచ్యుతాపురం నుంచి ర్యాలీగా దువ్వాడ వీఎస్ఈజెడ్‌కు చేరుకొని గేటు వద్ద ఆందోళనకు దిగారు. కార్మిక సంఘ నాయకులు వి.వి.రమణ, రొంగలి రాము మాట్లాడుతూ నిబంధనలను తుంగలోకి తొక్కి అభిజిత్ యాజమాన్యం లే ఆఫ్‌ను ప్రకటించిందని, లే ఆఫ్‌ను ఎత్తివేసి కార్మికుల్ని యధావిధిగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకుంటే ధర్నా కొనసాగిస్తామన్నారు. అనంతరం అసిస్టెంట్‌లేబర్ కమిషనర్ ఎం.రమ్య, దువ్వాడ వీఎస్ఈజెడ్ ఏడీసీ ప్రసన్న కుమార్‌లకు వినతిపత్రాలు అందించారు. సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు భద్రత కల్పించారు.



వీఎస్ఈజెడ్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న కార్మిక ప్రతినిధులు

కార్మిక వర్గానికి అండగా ఏఐటీయూసీ



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఆదినారాయణ



ఉక్కు లేబర్ గేటు వద్ద ..

ఉక్కునగరం: ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం స్టీల్‌ప్లాంట్‌లో ఘనంగా నిర్వహించారు. మెయిన్ గేటు వద్ద జెండా ఆవిష్కరించారు. స్టీల్ ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి డి. ఆదినారాయణ మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ముంబై నగరంలో ఏఐటీయూసీ ఆవిర్భవించి కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడానికి పోరాటాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో నాయకులు కె.ఎస్.ఎన్. రావు, జె. రామకృష్ణ, మసేనురావు, నర్సింగరావు, నరేష్‌కుమార్, రాజబాబు, టి. కనకరాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలి...


స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు డాక్టర్ బి. వెంకటరావు డిమాండ్ చేశారు. ఉక్కు లేబర్ గేటు వద్ద ఆయన యూనియన్ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను గాలికి వదిలి నక్కపల్లి తీరంలో అర్సెలర్ మిట్టల్‌కు ప్రైవేటు స్టీల్‌ప్లాంట్‌కు గనులు, భూములు కేటాయించడంలో అర్థం లేదన్నారు. కార్యక్రమంలో చుక్క శ్రీనివాసరావు, జి. తిరుపతి రావు, యు.ఎస్. రాజు, తులసి పాల్గొన్నారు.

అమ్మో.. దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డు!

- రెండున్నర కిలోమీటర్ల నిడివిలో రెండే లైట్లు
- సాయంత్రం అయితే అంధకారమే
- భయపడుతున్న స్థానికులు, ప్రయాణికులు



అగనంపూడి సిగ్నల్ పాయింట్ నుంచి రింగ్ రోడ్డు వరకు వీధి దీపాలు అమర్చని స్తంభాలు



రాత్రి పగలూ వెలుగుతున్న వీధి దీపాలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రయాణమంటే భయపడుతున్నారు. సాయంత్రం అయితే అంధకారంలోకి అలముకోవడంతో అమ్మో..! రైల్వేస్టేషన్ రోడ్డు అని భయపడుతున్నారు. అగనంపూడి మరిడిమాంబ కూడలి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ వరకూ రెండున్నర కిలోమీటర్ల నిడివిలో కేవలం రెండు స్తంభాలకే వీధి దీపాలు అమర్చారు. మిగిలిన ఏ స్తంభానికి ఒక్క వీధిలైట్ కానరావడం లేదు. ఈ మార్గంలో నిత్యం అగనంపూడి, లంకెలపాలెం, ఫార్మాసిటీ కాలనీ, స్టీల్ సెక్టార్ల నుంచి నిత్యం వేలాది మంది దువ్వాడ రైల్వేస్టేషన్, పాఠశాలలు, కళాశాలలు, వీఎస్ఈజెడ్‌లకు రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రాత్రి వేళల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఐదేళ్ల కిందట రహదారిని విస్తరించారు.అయితే ఈ మార్గంలో రెండు బహుళ అంతస్తుల వద్ద మాత్రమే రెండు వీధి దీపాలు అమర్చారు. దీంతో రాత్రి 8 దాటిన తర్వాత ఈ రోడ్డులోప్రయాణం అంటే హడలి పోతున్నారు. చేసేది లేక చుట్టూ తిరిగి కూర్మన్నపాలెం, జాతీయ రహదారి, టోల్‌గేటు మీదుగా అగనంపూడికి ప్రయాణం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



పాత అగనంపూడిలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అగనంపూడి హైస్కూల్ ఆవరణలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద నాయకులు



ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అగనంపూడి: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగంతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, ఆయన త్యాగం మరువరానిదని అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు గవర గున్నయ్య, సోమశేఖర్ అన్నారు. 79వ వార్డు పాత అగనంపూడి సత్రం కూడలిలో మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి, తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, సుబ్బారావు, వసంతరావు, గోవిందరావు, నాయుడు, వెంకటరావు పాల్గొన్నారు.

అగనంపూడి హైస్కూల్ ఆవరణలో...

85వ వార్డు అగనంపూడి హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా తెలుగు తల్లి విగ్రహానికి నివాళులర్పించారు. వార్డు నాయకులు ఇల్లపు ప్రసాద్, బండారు చందు రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, కత్తి తిలక్, విందుల రాజు, వడ్డాది శ్రీను, బుదిరెడ్ల అప్పారావు, కోట శ్రీధర్, పట్టా పైడిరత్నం పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

ఉక్కునగరం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్టీల్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన మహానుభావుడు శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, మంత్రి గోపి నారాయణ, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో...

స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు అమరణ దీక్ష చేసి అమరులయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో జి. వెంకటరమణారెడ్డి, ఎం. పరదేశి, పిట్టారెడ్డి, కర్రి దాలినాయుడు, కె. విజయకుమార్, నల్ల శ్రీనివాస్, బి.వి. రామయ్య, శశిభూషణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్‌లో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: ఈ నెల 19 నుంచి 21వరకు నిర్వహించనున్న విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాఖ బాలోత్సం నిర్వాహక ప్రధాన కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు విశాఖ బాలోత్సవం స్థానిక సెయింట్ ఆంథోనీ ప్రైమరీ పాఠశాలలో నిర్వహిస్తున్నామని, ఇప్పటికే స్కూళ్లకు వెళ్లి పోటీల వివరాల సెట్లు అందజేశామన్నారు. ఈ నెల 9లోగా బాలోత్సవ కేంద్రంలో ఎంట్రీలు అందజేయాలని స్కూళ్ల యాజమాన్యాలను కోరినట్టు తెలిపారు. బాలోత్సవం విజయవంతం చేసేందుకు జీవీఎంసీ కమిషనర్ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

పొంచి ఉన్న ముప్పు



ఫోకస్

ప్లాస్టిక్ బాటిళ్లు, పాలిథిన్ కవర్లు, చెత్తాచెదారంతో మింది విద్యుత్ సబ్ స్టేషన్ పక్కనున్న కాలువ నిండిపోయింది. ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ నుంచి సబ్ స్టేషన్ వరకు సర్వీసు రోడ్డు పక్కనున్న ఈ కాలువలో పలు రకాల వ్యర్థాలు కొట్టుకు వచ్చి నిలిచిపోయాయి. అడపాదడపా పూడికలను తొలగించినా మళ్లీ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇలాంటి సమయంలో భారీ వర్షం కురిస్తే తీవ్ర ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

–అక్కిరెడ్డిపాలెం

పడకేసిన పారిశుధ్యం



జీవీఎంసీ 75వ వార్డులోని పలు ప్రాంతాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది ప్రధాన కూడళ్లలో సైతం చెత్త పేరుకు పోతోంది. జనావాసాల మధ్య చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో పందులు అక్కడ తిష్ట వేసి చిందర చేస్తున్నాయి. దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

–పెదగంట్యాడ